VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 97
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 11 సెప్టెంబర్ 2026


# రివ్యూలు కాదు... రిజల్ట్స్ కావాలి

- ఆలోచనలతో పాటు... అమలూ ఉండాలి
- వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర
- కరవు ప్రాంతాలకు నీళ్లిస్తేనే నాకు సంతృప్తి
- రియాక్టివ్ నుంచి ప్రో యాక్టివ్ దిశగా అధికారులు పనిచేయాలి
- జిల్లాకు 25, నియోజకవర్గానికి 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించాలి
- మభ్యపెట్టే విధంగా కాదు... వాస్తవ నివేదికలు కావాలి
- కలెక్టర్లు, అధికారులు, మంత్రుల మధ్య పోటీ ఉండాలి
- 8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సాగునీటి రంగంలో విశేష కృషి చేసి వాటర్ మ్యాన్‌గా నిలిచిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్టాండింగ్ ఓవేషన్



**అమరావతి,కలంకౌంటర్ :** శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. గురువారం తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే... లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెన్స్ నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెన్స్‌కు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివృద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు.

**టీమ్ సక్సెస్‌తోనే అభివృద్ధి..** "ఈసారి లీడర్షిప్ అంశంపై కలెక్టర్ల సదస్సులో ప్రత్యేకంగా చర్చించాలి. కొన్ని చోట్ల లీడర్షిప్ లోపం ఉంది. ఉద్యోగుల సామర్థ్యం పెంపు కోసం వివిధ కోర్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకూ 1.50 కోట్ల కోర్సులను సామర్థ్యాలను పెంచేందుకు నిర్వహించాం. డీప్ టెక్ గవర్నెన్స్ ఉంటే అనూహ్యమైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీని వినియోగించడం ద్వారా డేటా లేక్, అవేర్ లాంటి వ్యవస్థలతో నిర్ణయాల్లో వేగం పెరగాలి... సేవల్లో నాణ్యత పెంచాలి. గతంలో 50 ఏళ్లలో చేసే అభివృద్ధిని ఇప్పుడు 10-15 ఏళ్లలోనే సాధించేందుకు ఆస్కారం ఉంది. మనకు వనరులు ఉన్నాయి. టెక్నాలజీ అందుబాటులో ఉంది. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా 27 నెలల్లో రాష్ట్ర ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టాం. రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. రాయలసీమ రైజింగ్, కోస్తాంధ్ర భవిష్యత్ కొత్త పుంతలు, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరిట ప్రగతి కార్యక్రమాలు చేపట్టాం. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్ -1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టులు పూర్తిచేశాం. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికల్లా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేసి గుంటూరు, విజయవాడకు రాజధానిని కనెక్ట్ చేశాం. ఎకనామిక్ టైమ్స్ పత్రిక సీఈఓ టూ వాటర్‌మాన్ అంటూ కథనం రాసింది. సంతోషం కలిగింది. గ్లోబల్ డ్రీమ్ కేబినెట్లో నా పేరు వచ్చినప్పుడు, సీఈఓ సీఎం అన్నప్పుడు కూడా నేను ఇంత ఆనందించలేదు. రాష్ట్రంలోని భౌగోళిక అసమానతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి ఉంది... దానిని సరిచేస్తూ నీటిని ఆయా ప్రాంతాలకు నీటిని ఇవ్వగలిగితే కలిగే సంతోషం వేరు. గోదావరి- కావేరీ- మహానది- గంగా లాంటి నదులు అనుసంధానమై వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే భారత అభివృద్ధి అన్ స్టాపబుల్. ఈ నీటి భద్రత, సంరక్షణా చర్యల్ని గుర్తించి వాటర్ మాన్ గా పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది. 36 ప్రాజెక్టులు చేపట్టేందుకు క్యాలెండర్ కూడా ఇచ్చాం. వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత అందరి మీద ఉంది. ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారం అధికారుల తోడ్పాటుతో ఈ విజయాలను సాధించగలిగాం. ఇప్పటి దాకా సాధించిన ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు.. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు.. ఇలా అందరి వల్ల సాధ్యమైంది.. ఈ విజయం టీమ్ సక్సెస్." అని సీఎం చంద్రబాబు చెప్పారు.



**అవకాశాలను అన్ లాక్ చేయండి... అభివృద్ధి సాధించండి..** "మనకు ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయగలిగాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10-15 ప్రాజెక్టులను ప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది. అందుకే అవకాశాలను అన్ లాక్ చేయాలని పదేపదే చెబుతున్నాను. ప్రతిస్పందించే పాలన ద్వారా సుపరిపాలన అందించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారంపై సత్వరం స్పందించాలి. జిల్లా కలెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి... మంచి జ్ఞాపకాలను మిగుల్చుకోవాలి. మా హయాంలో పలానా జిల్లాలో ఈ పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రో యాక్టివ్ గవర్నెన్స్ ఉండాలి. ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అంటే అభివృద్ధి-పాలన పెండింగ్ లో ఉన్నట్టే. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందినప్పుడే ప్రజల నుంచి సానుకూల స్పందన ఉంటుంది. నాకు పరిపాలన కంటే సుపరిపాలన ముఖ్యం. మంత్రులు, అధికారులు, కలెక్టర్లు ప్రభుత్వ సేవలు అందించే విషయంలో.. అభివృద్ధి సాధించే విషయంలో పోటీ పడాలి."అని ముఖ్యమంత్రి వివరించారు.

**నెలవారీ నివేదికలతో అభివృద్ధి ప్రయాణం..** "ప్రతి నెలా ఆర్థిక నివేదికను విడుదల చేసి ఎప్పటికప్పుడు లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నాం. ప్రతి మూడు నెలలకూ జీఎస్డీపీని కూడా లెక్కించి ప్రగతిలో ఎక్కడ ఉన్నామో చూస్తున్నాం. 2022-23 బేస్ ఇయర్ గా ప్రస్తుత ధరలకు అనుగుణంగా 13.44 శాతం వృద్ధి రేటు నమోదైంది. తయారీ రంగంలోనూ అభివృద్ధి నమోదు అయ్యింది. జీఎస్టీ వసూళ్లు కూడా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.25,450 కోట్ల మేర పెరిగాయి. రెవెన్యూ శాఖలో సంస్కరణల్ని అమలు చేస్తున్నాం. 120 ఏళ్ల నాటి భూ సమస్యల్ని కూడా పరిష్కరిస్తున్నాం. 1908 నుంచి అమలాపురంలో గ్రౌండ్ రెంట్ భూముల విషయంలో నిర్ణయం తీసుకుని 1,416 మందికి పట్టాలు ఇచ్చాం. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేసే బాధ్యత మనందరిది. పాలన అంటే గుడ్డిగా పనిచేయటం కాదు. వినూత్న ఆలోచనలు చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలి. బెస్ట్ పాలసీలు తెచ్చి ప్రభుత్వ సేవలను సులభతరం చేయాలి. కొత్త ఆలోచన- కొత్త ఆవిష్కరణలతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రస్తుతం 13.44 శాతం వృద్ధి నమోదైంది. దీనిని 15 శాతం దిశగా తీసుకెళ్దాం." అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

**ఇద్దరు మహిళా అధికారులకు సీఎం ప్రశంసలు..** "కొందరు వ్యక్తులు ఫేక్ ప్రచారంతో సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. వేగంగా స్పందిస్తే దానికి కౌంటర్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. సరైన సమయంలో స్పందించకపోతే ఆ శిక్ష ప్రభుత్వానికి పడుతుంది. కొందరు రాజకీయాలు చేస్తూ తప్పు దోవ పట్టించే ప్రయత్నం జరుగుతోంది. డీఎస్సీ-2025లో ఎక్కడా తప్పు జరగలేదు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలిచ్చాం. కానీ కొందరు అదే పనిగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. దీనిపై ఇద్దరు మహిళా అధికారులు చక్కగా

- 2లో

## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా: జగన్

- మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయన్న జగన్
- స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారని ప్రశ్న
- జూడో ఆట కింద 39 మందికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శ



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్-సీఈఆర్టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు. జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ

- ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు
- ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తామని సీఎం హామీ
- పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు
- ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు
- ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ



**తెలంగాణ, కలంకౌంటర్ :** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## ఇళ్ల పట్టాలు, క్రమబద్ధీకరణ జాబితాను సిద్ధం చేయండి

- 10 రోజుల్లో సమగ్ర ప్రణాళికతో రండి : కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి పట్టాలు అందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలపై పరిమిత సమయం పెట్టుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి 10 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై చర్చించారు. ప్రస్తుతం 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వచ్చే నెల 15వ తేదీ నాటికి వాటి పరిశీలన పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 1,692 గ్రామాల్లో 18 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎంతమందికి కొత్తగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలి.. ఎంతమందికి పట్టాలను క్రమబద్ధీకరించాలనే అంశాలపై స్పష్టమైన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇళ్ల పట్టా అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అర్హుల గుర్తింపు నుంచి పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాల పూర్తి వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

## నాగార్జున వర్సిటీ గోల్డెన్ జూబ్లీకి ప్రత్యేక గుర్తింపు.. పోస్టల్ స్టాంపును ఆవిష్కరించిన నారా లోకేశ్



**విజయవాడ, కలం కౌంటర్ :** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) 50 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా రూపొందించిన ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. గురువారం సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. యూనివర్సిటీ స్వర్ణోత్సవ (గోల్డెన్ జూబ్లీ) వేడుకలు చిరకాలం గుర్తుండిపోయేలా ఈ ప్రత్యేక స్టాంప్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని ఈ ప్రత్యేక స్టాంప్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన తన సోషల్ మీడియా ఖాతా ద్వారా కూడా పంచుకున్నారు. యూనివర్సిటీ 50 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలు, విద్యారంగానికి అందించిన సేవలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. స్వర్ణోత్సవాల నేపథ్యంలో చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యామండలి కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధర రావు, రెక్టార్ ఆర్. శివరామ్ ప్రసాద్, రిజిస్ట్రార్ జి. సింహాచలం సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నాయకత్వంలో కొత్త ఆలోచన.. పాలనలో సరికొత్త వేగం

- న్యూ ఏజ్ గవర్నెన్స్‌తో స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన
- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు





**అమరావతి, కలంకౌంటర్ :** నాయకత్వంలో కొత్త ఆలోచనా విధానంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో లీడర్షిప్--న్యూ ఏజ్ గవర్నెన్స్ అంశంపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తాము లీడర్షిప్ ట్రాన్సిషన్‌లో ఉన్నామని, న్యూ లీడర్షిప్ అప్రోచ్‌తో పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నాయకత్వం అనేది సెల్ఫ్ మోటివేషన్‌తో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఫైల్స్, డేటా లేక్ వంటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా చూసుకుంటూ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. టెక్నాలజీ యుగంలో నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మారిందని, నైపుణ్యానికి ఎంత పదును పెడితే అంత ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు.

**ప్రపంచంలోనే అత్యుత్తమంగా భారతీయ ఎంట్రప్రెన్యూర్స్..** మహిళలు--పురుషులు అనే వ్యత్యాసం గత కాలపు నినాదమని, ఇప్పుడు ఆ తేడా లేదని సీఎం చంద్రబాబు అన్నారు. బ్యూరోక్రసీకి, రాజకీయ నేతలకు వేర్వేరు నైపుణ్యాలు ఉండాల్సిందేనని పేర్కొన్నారు. ప్రతి నాయకుడూ తన బృందాన్ని ఎంత ప్రభావవంతంగా నిర్మిస్తారన్నదే ఫలితాలను నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి రంగంలోనూ సంతృప్తి అనేదే ముఖ్యమని అన్నారు. ప్రపంచంలోనే భారతీయ ఎంట్రప్రెన్యూర్స్ అత్యుత్తమంగా ఉన్నారని, ప్రతిష్ఠాత్మక కంపెనీలకు వారే సారథ్యం వహిస్తున్నారని సీఎం చెప్పారు. ఏ వ్యవస్థలో అయినా ఇమిడిపోయే తత్వం భారతీయులదని, దానికి అనుగుణంగా మనం కూడా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగ వ్యవస్థలే మారిపోతున్నాయని, అంతిమంగా క్రెడిబిలిటీ అనేదే కీలకమని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమను తాము మార్చుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గతంలో చాలా అంశాలపై దృష్టి పెట్టామని, ఇప్పుడు నాయకత్వంపైనే ఆలోచన చేయాలని నిర్ణయించామని తెలిపారు. నూతన నాయకత్వ విధానంతో పనిచేయడం ద్వారా వేగంగా ఫలితాలను సాధించడంతో పాటు స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకునేందుకు ఆస్కారం ఉంటుందని సీఎం అన్నారు.

## 8వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో లీడర్ షిప్ అంశంపై ప్రత్యేక సెషన్..









**అమరావతి,కలంకౌంటర్ :** ఇటీవల కాలంలో పరిపాలనలో నాయకత్వం పెంపొందించే అంశంపై ఫోకస్ పెట్టాలని చెబుతున్న ముఖ్యమంత్రి. దీనికి అనుగుణంగా లీడర్ షిప్ అంశాన్ని కలెక్టర్ల కాన్ఫరెన్సులో అజెండాగా చేర్చిన ప్రభుత్వం. అధికారులు, ఉద్యోగుల్లో నాయకత్వ పటిమను పెంచితే ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని చెబుతోన్న ముఖ్యమంత్రి. పాలనలో వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణల అమలుకు నాయకత్వంతోనే సాధ్యమని భావిస్తోన్న ప్రభుత్వం.



# సాగునీటి రంగంలో విశేష కృషి చేసి వాటర్ మ్యాన్‌గా నిలిచిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్టాండింగ్ ఓవేషన్

























(మొదటిపేజీ తరువాయి)

స్పందించి కౌంటర్ ఇచ్చారు... వారిని అభినందిస్తున్నా. ఉద్యోగాలు వచ్చిన ఉపాధ్యాయులు కొండారెడ్డి బురుజు, విజయవాడ అంబేద్కర్ విగ్రహం, విశాఖ బీచ్ రోడ్డులో ఆరోపణలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. దుష్ప్రచారం ఆపకపోతే వారి పార్టీని బంగాళాఖాతంలో కలుపుతామని నినదించారు. గత ప్రభుత్వం నిర్వాకంతో మార్కెట్టులోకి వచ్చిన జే బ్రాండ్ మద్యం వల్ల 30 వేల మంది చనిపోయారు. వారి ఆరోగ్యం కూడా దెబ్బతింది. కల్తీ బ్రాండ్లన్నీ రద్దు చేసి పారదర్శకంగా విక్రయాలు జరిగేలా చూస్తున్నాం. విద్యుత్ టారిఫ్ పెంచకుండా నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేస్తున్నాం. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో కారణంగా నీటి భద్రత ఓ సవాలుగా మారింది. 54 శాతం లోటు వర్షపాతం ఈసారి రాష్ట్రంలో నమోదైంది. గతేడాది ఇదే సమయానికి రిజర్వాయర్లలో 85 శాతం నీటి నిల్వలు ఉంటే ఈసారి మాత్రం 57 శాతం మాత్రమే ఉన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం లాంటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. కేంద్ర ప్రాయోజిత పథకాలైన జల్ జీవన్ లాంటి మిషన్ను గత ప్రభుత్వం సరిగ్గా వినియోగించుకోలేదు. అవి చేసి ఉంటే నీటి భద్రతకు ఆస్కారం ఉండేది. ప్రతీ ఇంటికీ కుళాయి ద్వారా నీరివ్వగలిగే వాళ్లం. తాగు నీటి సరఫరా విషయంలో ఎలాంటి రాజీ లేదు. పీఎండీఎస్, ప్రకృతి సేద్యం ద్వారా ప్రతీ ఎకరానూ సాగులోకి తీసుకురావాలి. సంక్షోభంలోనే కలెక్టర్ల నాయకత్వం వెలుగు చూడాలి."అని సీఎం చంద్రబాబు అన్నారు.

**సీఈఓ టు వాటర్ మ్యాన్..** ఎకనమిక్ టైమ్స్ లో వచ్చిన వాటర్ మ్యాన్ ఆర్టికల్ గురించి కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. సాగునీటి రంగంలో సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందిస్తూ కలెక్టర్ల కాన్ఫరెన్సులో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..."నీటి వనరుల రంగంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సాధించిన విజయాలను దేశం గుర్తించింది. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల గురించి వివిధ రాష్ట్రాల్లో చర్చ జరుగుతోంది. ఈ నిశ్శబ్ద పురోగతి వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారు. మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్సులోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. అందుకే హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లు ఇవ్వగలిగాం. ఉమ్మడి రాష్ట్రంలో ఇజ్రాయెల్ నుంచి డ్రిప్ టెక్నాలజీని తీసుకువచ్చి రాష్ట్రంలో అమలు చేశాం. గతంలో రూ.16 మీటరు డ్రిప్ పైప్ ఖరీదు. ఇప్పుడు 30 ఏళ్ల ద్రవ్యోల్బణం తర్వాత రూ.1.60 పైసలకే దొరుకుతోంది. రాయలసీమ జిల్లాల్లో డ్రిప్ ద్వారా చేసిన సాగు, సృష్టించిన సంపదే దీనికి ఉదాహరణ. పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించారు. కానీ ఆదే ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకూ 500 టీఎంసీల నీటిని తరలించగలిగాం. ప్రకాశం బ్యారేజీని 200 సార్లు ఇప్పటి వరకూ నింపగలిగాం. డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సృష్టించిన నిశ్శబ్ద నీటి ప్రయాణాన్ని రాష్ట్ర ప్రజలు, దేశం కూడా గుర్తించింది. రైతుల గురించి సీఎం పడుతున్న నిరంతర తపనను ఎకనమిక్ టైమ్స్ పత్రిక వాటర్ మాన్ గా ఆయన్ను కీర్తిస్తూ కథనం రాసింది. ఇది సీఎం సాధించిన విజయం.. ముఖ్యమంత్రి విజయంలో ఏపీ అభివృద్ధి ఉంది." అని మంత్రి అన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీసీఎల్ఏలో స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్

- ఎస్సీలకు కలిగే ప్రయోజనాలను బుడగ జంగాలకూ వర్తింప చేయండి
- ప్రణాళిక ప్రకారం కలెక్టర్లు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి
- కలెక్టర్ల సదస్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సీఎం చంద్రబాబు ఆదేశాలు













**అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న భూములకు సంబంధించి స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్‌ను తయారు చేయాలని రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టులపై చర్చ సందర్భంగా వేర్వేరు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండిపోతున్న భూముల్ని గుర్తించి వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సీఎం స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయ్యాక ప్రభుత్వ భూములపై పూర్తి స్పష్టత వస్తుందని సీఎం అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఏళ్లుగా వినియోగం లేని భూముల్ని గుర్తించాలన్నారు. వాటి వివరాలను కామన్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్ కిందకు తీసుకు రావాలన్నారు. జిల్లాలు, శాఖల వారీగా ప్రభుత్వ భూముల వివరాలను నమోదు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏ ప్రభుత్వ శాఖకు భూమి అవసరమైనా ఈ పోర్టల్ ద్వారా కేటాయించే పరిస్థితి ఉండాలని అన్నారు. భూమి కొరత అభివృద్ధికి అడ్డంకి కాకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టు మంజూరు అయిన తర్వాత భూమి కోసం వెతకకుండా ముందుగానే పారిశ్రామిక, అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు.

**మూడు నెలల కార్యాచరణ ముందుగానే..** ప్రతి ప్రభుత్వ శాఖ, జిల్లా కలెక్టర్ స్పష్టమైన యాక్షన్ క్యాలెండర్ ను రూపొందించుకుని నిర్దేశిత గడువులోగా ఫలితాలు సాధించాలన్నారు. కలెక్టర్ల సదస్సు కేవలం చర్చలకు మాత్రమే పరిమితం కాకుండా ఫలితాలను సాధించేలా ఉండాలన్నారు. జిల్లాల అధిపతులుగా కలెక్టర్లు అన్ని శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై 360 డిగ్రీల కోణంలో దృష్టి సారించాలని అన్నారు. శాఖల మధ్య ప్రభావితం అయ్యే పనుల్ని కలెక్టర్ పరిష్కరించాలన్నారు. సమస్యల్ని ప్రస్తావించటం ఒక్కటే కాకుండా పరిష్కారం చూపేలా కలెక్టర్లు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. బాధ్యతను మరొకరికి బదిలీచేసే తత్వాన్ని విడనాడాలన్నారు. ముఖ్యమంత్రిగా తాను మూడు నెలల కార్యక్రమాలను ముందే నిర్దేశించుకుంటా నని వెల్లడించారు. ప్రతీ నెలా ఎస్ఐపీబీ సమావేశాలతో పాటు ప్రతీ 15 రోజులకూ కేబినెట్ సమావేశంతో పాటు ప్రతీ మూడు నెలలకూ కలెక్టర్ల సదస్సు, ప్రతీ నెలా 4 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ప్రజల దగ్గరకు వెళ్తున్నానని అన్నారు. సీఎంగా తనపై కేంద్ర ప్రభుత్వం కూడా ఉంటుందని దానికి అనుగుణంగానే ప్రణాళిక చేసుకుంటున్నట్టు సీఎం కలెక్టర్లకు వివరించారు. కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా కలెక్టర్లు కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నిర్ణయాల్లోనూ ఎస్కేపిజం కుదరదని రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రోయాక్టివ్ గవర్నెన్సుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

**యాక్షన్ టేకెన్ రిపోర్టు పై దిశానిర్దేశం..** ఎస్సీ వర్గాలకు ఇచ్చే ప్రయోజనాలను బుడగ జంగాలకు పొడిగించే అంశంపై తక్షణం ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బుడగ జంగాలకు ఎస్సీ హోదా కల్పించే అంశం పెండింగులో ఉన్న నేపథ్యంలో ఎస్సీలకు కలిగే ప్రయోజనాలను వారికీ అందించాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ పరిశ్రమలతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని అనుసంధానించాలని అన్నారు. కరిక్యులమ్, పరికరాలు తదితర అంశాలను 90 రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన గృహాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. అదనంగా మంజూరు అయ్యే గృహాలను దశలవారీగా అమలు చేయాలని సీఎం నిర్దేశించారు. త్వరలోనే మరో 1.5 లక్షల గృహాలు ఏపీకి అదనంగా మంజూరు అయ్యే అవకాశం ఉందని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరా విషయంలో అత్యవసర పనుల్ని వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రంలో 50 శాతం హరిత ప్రాంతాన్ని సాధించేలా ప్లాంటేషన్ సీజన్ కు ముందే అవసరమైన 20 కోట్ల విత్తనాలను, మొక్కల్ని సిద్ధం చేసుకోవాలన్నారు. తక్కువ నీటి అవసరం ఉన్న మొక్కల్ని ప్రోత్సహించాలని నీటి సంరక్షణా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 905 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించి కేంద్రంతో మాట్లాడాలని స్పష్టం చేశారు.

# రాష్ట్ర మంతటా డిజిటల్ కనెక్టివిటీ

- టెలికాం కనెక్టివిటీ లేని ప్రాంతం కనిపించకూడదు
- టవర్ల నిర్మాణానికి స్థల సమస్య అడ్డు కారాదు
- జిల్లా కలెక్టర్లు ఈ దిశగా సహకరించాలి
- ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంన్టని

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రమంతటా డిజిటల్ కనెక్టివీ కల్పించాలన్నదే ప్రభుత్వ ఆశయమని, రాష్ట్రంలో ఏ ప్రాంతం కూడా టెలీకాం కనెక్టివిటీ లేదనే మాట ఉత్పన్నం కాకుండా ఉండాలన్నదిశగా ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని తెలిపారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఆయన డిజిటల్ కనెక్టివిటీ స్థితిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకం కింద రాష్ట్రానికి మొత్తం 1023 టవర్లు మంజూరయ్యాయని, ఇదులో 143 టవర్ల ఏర్పాటు చేయడం జరిగిందని, 428 టవర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. 11 టవర్లకు అటవీ భూమి సమస్యగా ఉందని చెప్తున్నారని, జిల్లా కలెక్టర్లు అటవీ భూమి చూపితే చాలని, దీనికోసం నిధులు కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ సమస్య పరిష్కరిస్తే టవర్ల నిర్మాణం వేగవంతంగా పూర్తవుతుందన్నారు. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు కూడా కనెక్టివిటీ ఇవ్వడానికి అవకాశముంటుందని చెప్పారు. దీంతో పాటు వందశాతం కనెక్టివిటీ కింద రాష్ట్ర ప్రభుత్వం మరో పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. వచ్చే కలెక్టర్ల కాన్ఫరెన్సులోపు టవర్ల నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామని, కలెక్టర్లు దీనికి సహకారం అందివ్వాలని చెప్పారు

# జిల్లాల ప్రగతితోనే వృద్ధి పరుగు సాధ్యం

- జిల్లా కలెక్టర్లు దీనిపై దృష్టి సారించాలి
- ప్రతి జిల్లాకు ప్రత్యేక అవకాశాలుంటాయి
- వాటిని గుర్తించి ఆ దిశగా జిల్లాను ఆదాయ మార్గాలు పెంచాలి
- వృద్ధిరేటుపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్

**అమరావతి,కలంకౌంటర్ :** జిల్లాల ప్రగతి చిత్రమే రాష్ట్ర వృద్ధి పరుగుకు ఊతమిస్తుందని, జిల్లా కలెక్టర్లు ప్రతి నెలా స్థూల విలువ జోడింపులో తాము ఏ దశలో ఉన్నామో తెలుసుకుని ముందుకు వెళ్లడానికి కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ సూచించారు. సచివాలయంలో జరుగుతున్న 8వ కలెక్టర్ల సదస్సులో ఆయన రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై పవర్ పాయింటు ప్రజంటేషన్ ఇచ్చారు. జిల్లాల అభివృద్ధికి విజన్ ఫ్రేమ్ వర్క్ రూపొందించి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఆర్థికాభివృద్ధిలో ఆయా జిల్లాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది తెలుసుకోవడానికి ఎప్పటికప్పుడు మదింపు వేస్తున్నామన్నారు. మండల స్థాయిలో కూడా ఆర్థిక ప్రగతిని మదింపు వేస్తున్నామని, ఆయా జిల్లాలు స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో ఏ ర్యాంకులో ఉన్నామనేది తెలుసుకుని, ఎక్కడెక్కడ వెనకబడ్డామో ఆయా రంగాల్లో ప్రగతి సాధించడానికి కృషి చేసేలా కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు. మనం పనిచేస్తున్నాం కానీ ఎంతమాత్రం ఫలితాలు సాధిస్తున్నామనేది ముఖ్యంగా పరిశీలించాలన్నారు. ఒక జిల్లాను మరో జిల్లాతో పోల్చలేమని, ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అవకాశాలుంటాయని, ఆయా రంగాల్లో ఆదాయార్జన పాటుపడాలన్నారు. జిల్లాలో జరిగే వస్తు, వ్యవసాయోత్పత్తులకు మార్కెట్లో మంచి ధర లభించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏ మండలం బలం ఏంటీ, దానికున్న ప్రధాన ఆర్థిక బలాలేంటీ, ఆ మండలం ఎందుకు వెనుకబడింది అనేది సమీక్షించుకుని ఆయా మండలాల్లు ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాగా రాణించిన జిల్లాలను ఆదర్శంగా తీసుకుని వెనుకబడిన జిల్లాలు ముందుకు వెళ్లాలన్నారు. డేటా ఆధారంగా తమ జిల్లాకు దశను, దిశను కలెక్టర్లు నిర్దేశించుకోవాలని సూచించారు.

# బండ్లమ్మ ఆలయంలో ఉచిత వైద్య శిబిరం



**చందోలు,కలంకౌంటర్ :** ప్రసిద్ధిగాంచిన శ్రీ బండ్లమ్మ అమ్మవారి ఆలయానికి విచ్చేసే భక్తుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ శాఖ, చందోలు విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో భక్తులకు ఉచిత వైద్య సలహాలు, ఆరోగ్యపరమైన సూచనలు, అవసరమైన మందులు అందించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు, గ్రామస్తులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈవో కోరారు.

# సాగునీరందించి కృష్ణా డెల్టాను కాపాడాలి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** కృష్ణ డెల్టా ప్రాంతంలో సాగునీరుకొరత తో వరి పంటలు పాడవుతున్నాయని సాగునీరు అందించి ప్రభుత్వం వరి పంటలను కాపాడాలని కృష్ణాజిల్లా డెల్టా రైతాంగం పట్ల, చిన్న సన్న కారు కౌలు రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ రాష్ట్ర సభ్యులు వై వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కృష్ణాజిల్లా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉయ్యూరు శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి పంటలపై ఎల్ ని నో ప్రభావం ఉన్నప్పటికీ వరి నాటిన రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని కృష్ణా డెల్టా రైతులందరికీ నష్టం వాటిల్లకుండా చూడాలని ఆయన అన్నారు. అలాగే వ్యవసాయ పనులు చేసుకునే దినసరి కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించి ఆదుకోవాలని వైవి అన్నారు. ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తీసుకున్న నూతన పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి లబ్ధిదారులు అన్ని కార్యాలయాలకు కాళ్లు అరిగేలా గుర్తింపు ధ్రువీకరణ పత్రాల కోసం నానా అవస్థలు పడుతున్నారని, దరఖాస్తు లు గడువు అవకాశం ఉన్నంత మేర పొడిగించాలని వై.వి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివ నాగేంద్ర మండల పార్టీ కార్యదర్శి బి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవతా వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కుటుంబానికి ఆర్థిక సాయం



**కందుకూరు,కలంకౌంటర్ :** పోకూరు గ్రామానికి చెందిన పాదర్తి వెంకటనారాయణ గత కొంతకాలంగా కోవూరు రోడ్డు నందు ఉన్న శ్రీ లక్ష్మీ హోటల్లో పనిచేయుచున్నాడు. ఈ మధ్యకాలంలో ప్రమాదానికి గురై తలకు, కాలికి తీవ్ర గాయం అయ్యి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదేవిధంగా నారాయణ భార్య వెన్నుముక సమస్యతో బాధపడుతుంది. వీరికి మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సాయం కోరగా, కందుకూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వైస్ చైర్మన్ గుర్రం చిన్న అల్లూరయ్య ఆధ్వర్యంలో రూ 5000/-లు దాతల సహకారంతో వాసవి నగర్ నందు నారాయణ తమ్ముడు ఇంటి వద్ద అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి జి సి ఎ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా ప్రెసిడెంట్ షేక్ గౌస్ బాషా, చక్కా వెంకట కేశవరావు, ముక్కాల మయూరనాథ్, నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్:** వైసీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న, చిటికెన నాగేశ్వరావు, మీర్ అస్గర్,గాజుల భగవాన్ తదితరులకు కలం కౌంటర్ దినపత్రిక వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ పంపిణీ చేసిన రవికుమార్.

# వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కలం కౌంటర్ దినపత్రిక ప్రచురించిన వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీనివాస్ లకు అందజేసిన రవికుమార్.ఈ సందర్భంగా సన్నిధి సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ నిబద్ధత, క్రమశిక్షణ తో పత్రికను నడుపుతూ ప్రజల పక్షాన గళం వినిపిస్తూ, ప్రతి ఏడాది వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ ఉచితంగా పంపిణీ చేస్తున్న కలం కౌంటర్ దినపత్రిక అధినేత రవికుమార్ ను అభినందించారు.

# గుండంకట్ట అభివృద్ధి..

## త్వరలో కానున్నది పచ్చదనాల గుట్ట..



**కందుకూరు, కలంకౌంటర్ :** ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నవనవోన్మేషంగా రూపుదిద్దుకోనున్న గుండంకట్ట.?. 1.కోటి రూపాయల పైచిలుకు నిధులతో గుండం కట్టపై , అత్యాధునిక రివిట్మెంట్, బ్యూటిఫికేషన్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో గుండంకట్ట పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, పచ్చదనాన్ని పంచనుంది. త్వరలో పనులు సాకారం కానున్నాయి పట్టణం నూతన శోభను సంతరించుకోనుంది

# కార్పొరేషన్ మెయిన్ పార్కులో లంకిశెట్టి సిమెంట్ బెంచీలు వితరణ...



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం మున్సిపల్ పార్క్ అభివృద్ధిలో నగర ప్రజలందరూ సహకరించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాదు పిలుపునిచ్చారు. గురువారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో దివంగత విద్యుత్ శాఖ ఉద్యోగస్తులు లంకిశెట్టి పాండురంగారావు మరియు లంకిశెట్టి దుర్గా వెంకటసాయి ప్రసాద్ జ్ఞాపకార్థం సిమెంట్ బెంచ్ లను వారి కుమారుడు లంకిశెట్టి రామకృష్ణ మున్సిపల్ పార్కుకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నగర జనసేన పార్టీ అధ్యక్షులు గడ్డం రాజు మాట్లాడుతూ దివంగత తల్లిదండ్రుల పేరుమీద పిల్లల చేసే సేవా కార్యక్రమం దైవ కార్యక్రమతో సమానమని అన్నారు. సిమెంట్ పెంచి లేపార్టు పార్కు వచ్చే వాకర్లకి వృద్ధులకు సందర్శలకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ కన్వీనర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, లంకిశెట్టి రామకృష్ణ, మున్సిపల్ పార్క్ సూపర్వైజర్, కార్పొరేషన్ బాలికల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు

# అమృత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కోనేరు సెంటర్ లో ఘంటసాల మురళి స్వామి పర్యవేక్షణలో దాతల సహకారంతో అమృత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో వేలాదిమందికి ప్రతి అమావాస్యకు అన్న సమారాధన వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఘంటసాల మురళి స్వామి తెలిపారు. వినాయక చవితికిలి వింత పోకడలు పోకుండా వినాయక చవితి పందిర్లలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన వేదాల్లో ఉన్న మన సంస్కృతిని తెలిపే చాగంటి కోటేశ్వరావు ప్రవచనాలు భక్తి గీతాలు మాత్రమే భక్తులు ఆలకించే విధంగా కమిటీ వారు ఏర్పాటు చేయాలని మురళి స్వామి కమిటీ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డంరాజు మాట్లాడుతూలి ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే భగవద్గీత సారాంశమని ధర్మాన్ని కాపాడ్డానికి లోకకళ్యాణార్థం శ్రీమహావిష్ణువు త్రేతాయుగంలో రాముడు గా ద్వాపర యుగంలో కృష్ణుడుగా మానవ రూపంలో జన్మించి వారు చూపిన బాట మానవ జీవితానికి ఆదర్శమనిశ్రీరామ చంద్ర మూర్తి ఏకపత్ని వ్రతుడుగా, కొడుకుగా,అన్నగా, భర్తగా, రాజుగా,త్యాగమూర్తిగా ప్రతి ఒక్కరికి ఆదర్శమని గడ్డం రాజు పేర్కొన్నారు. ధర్మాన్ని కాపాడ్డానికి శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతను అందించి అందులో తత్వాలను మానవుడు ఆచరిస్తే సన్మార్గాన్ని పొంది మానవుడు ఉన్నత స్థితులకు ఎదిగి మహనీయుడిగా వెలుగొందుతారని గడ్డంరాజు పేర్కొన్నారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి భగవద్గీతను బోధించి ధర్మసంస్థాపన కొరకు యుద్ధం తప్పదని ధర్మాన్ని కాపాడిన శ్రీకృష్ణ పరమాత్ముడు అందించిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదివి పిల్లలతోచదివించాలని సనాతన ధర్మ విశిష్టత భావితరాలకు అందించాల్సిన బాధ్యత హైందవ సంస్కృతిని ఆచరించే ప్రతి ఒక్కరిపై ఉందని గడ్డ రాజు తెలిపారు .ఈ కార్యక్రమంలో అమృత అయ్యప్ప సేవాసమితిసభ్యులు కోకసత్యన్నా రాయణ, కోనప్రసాద్, సూరిబాబు, పాకలపాటిశివ, మహారెడ్డి సత్యనారాయణ గుడ్లవల్లేరు చంద్రశేఖర్ భక్తులు అన్న ప్రసాద వితరణ సేవకులు ప్రజలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన సన్నద్ధత



**తాడేపల్లి,కలంకౌంటర్ :** తాడేపల్లిలో నిర్వహించిన జనసేన పార్టీ స్థానిక ఎన్నికల అవగాహన కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కృష్ణా జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం మచిలీపట్నం పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ మండలి బుద్ధ ప్రసాద్ , కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు బండి రామకృష్ణ , పినిశెట్టి నాగచాయాదేవి ,చిలకలపూడి పాపారావు , పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి నియమితులైన కమిటీ సహాయ సభ్యులతో కలిసి పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు సాగడం, జనసేన పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

# వాసవి మాతకు శ్రావణ సారె సమర్పించిన మహిళా మణులు




**కావలి,కలంకౌంటర్ :** పట్టణంలోని కొత్త బజారులో కొలువైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పవిత్ర శ్రావణ మాసాన్నిపురస్కరించుకుని బుధవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో శ్రావణ సారెను సమర్పించారు. వాసవి మహిళా మణుల ఆధ్వర్యంలో స్థానిక అయిదులాంతర్ల సెంటర్‌లోని శ్రీ రామాలయం వద్ద మహిళలు సాంప్రదాయ వస్త్రధారణతో సారె తట్టలను తలపై ధరించి శోభాయాత్రగా బయలుదేరారు. ఆలయానికి చేరుకున్న అనంతరం అర్చక స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి పసుపు, కుంకుమలు, గాజులు, పట్టు వస్త్రాలు, పండ్లు, పూలు, పిండివంటలతో కూడిన పవిత్ర శ్రావణ సారెను శాస్త్రోక్తంగా సమర్పించారు.

# వివికెను సన్మానించిన వాణి వెంకట్



**గుంటూరు,కలంకౌంటర్ :** ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా నియమితులైన వి వి కే నరసింహారావును గుంటూరు పార్లమెంట్ బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు త్రిపురమల్లు వాణివెంకట్ గురువారం మర్యాదపూర్వక కలిసి అభినందించారు సమాజ సేవలో ఎంతో అనుభవం నిబద్ధత కలిగిన నరసింహారావు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏపీ అధ్యక్షులుగా నియమించబడటం మన ఆర్యవైశ్య సంఘానికి గర్వకారణం అని వాణి వెంకట్ అన్నారు. నరసింహారావు ఆధ్వర్యంలో వామ్ సంస్థ రాష్ట్రంలో మరింత అభివృద్ధి చెందుతుందని సమాజంలో ఉన్న పేద ఆర్యవైశ్యులకు మరిన్ని సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరుచూరి చంద్రిక పాల్గొన్నారు.

## ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, కొనకళ్ల బుల్లయ్య అభినందనలు

### వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ పంపిణీ




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కలం కౌంటర్ దినపత్రిక ప్రచురించిన వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు , టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ళ బుల్లయ్య లకు అందజేసిన రవికుమార్. ఈ సందర్భంగా వీరిరువురు వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తూ పాఠకుల మన్ననలు పొందుతున్న రవికుమార్ ను అభినందించారు.

## ఎం ఎల్ ఏ ఆవిష్కరణ



**పామర్రు,కలంకౌంటర్ :** కలంకౌంటర్ తెలుగు దినపత్రిక ప్రచురించిన వినాయక వ్రతకల్పం బుక్స్ పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆవిష్కరించారు.

## శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** విశాఖపట్నం లో శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం చైర్మన్ కందుల నాగరాజు గారి ఆధ్వర్యంలో కలం కౌంటర్ దినపత్రిక వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వ్రత కల్పం బుక్స్ అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పాఠకులకు పంపిణీ చేస్తున్న కలం కౌంటర్ దినపత్రిక అధినేత రవికుమార్ కు అభినందనలు తెలిపారు.



## వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ ఆవిష్కరణ



**(పల్నాడు జిల్లా )సత్తెనపల్లి ,కలంకౌంటర్ :** కలంకౌంటర్ దినపత్రిక ప్రచురించిన వినాయక చవితి వ్రతకల్పం పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆంధ్రప్రదేశ్ యువజన సంఘం అడిషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాశెట్టి సాత్విక్ రామ్ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరావు, కార్యక్రమం లో పాల్గొన్న కలం కౌంటర్ దినపత్రిక పల్నాడు జిల్లా ఇంచార్జ్ ప్రసాద్ ఆదిత్య ,పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు చిలంచర్ల కళ్యాణ్ పట్టణ యువజన సంఘ సభ్యులు.

## వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ ఆవిష్కరించిన ఎం ఎల్ ఏ అదితి గజపతిరాజు



**విజయనగరం,కలంకౌంటర్ :** కలం కౌంటర్ దినపత్రిక ప్రచురించిన వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ ఆవిష్కరించిన ఎం ఎల్ ఎ పి అదితి గజపతిరాజు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అవనాపు విజయ్, సీనియర్ జర్నలిస్ట్ సముద్రాల నాగరాజు , శ్రీకాకుళం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వ్రత కల్పం బుక్స్ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** క్రమం తప్పకుండా కలంకౌంటర్ తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో వినాయక వ్రతకల్పం పుస్తకాలు ప్రచురించి హిందూ బంధువులందరికీ పంపిణీ చేసే మంచి సంప్రదాయాన్ని కలంకౌంటర్ యాజమాన్యం నిర్వహించడం అభినందనీయమని మచిలీపట్నం అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. గురువారం లంకెశెట్టి కార్యాలయంలో వినాయక వ్రతకల్పం పుస్తకావిష్కరణ జరిగింది. వినాయక చవితి విశిష్టతను తెలియజేసే విధంగా గణపతి విశేష నామాలు , విఘ్నేశ్వరుని ప్రార్థన విఙ్ఞేశ్వరుడు దండకం విగ్నేశ్వర అష్టోత్తర శతనామావళి వినాయక వ్రతకల్పంతో మల్టీకలర్ లో ఎక్కువ ఖరీదు తో పుస్తకాలు ప్రచురించడం అభినందనీయమని అందుకు కృషి చేసిన సిహెచ్ రవి కుమార్ ను బాలాజీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కలంకౌంటర్ చీఫ్ ఎడిటర్ సిహెచ్ రవికుమార్ మరియు మురారి పాండురంగారావు రాజుల పార్టీ యశోద రావు మురారి సూర్యచంద్రరావు మురారి జగన్ మోహన్ రావు సీతంశెట్టి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## దేవాదాయ శాఖ అధికారికి వినాయక చవితి వ్రత కల్పం పుస్తకం




**మంగళగిరి,కలంకౌంటర్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కోగంటి సునీల్ కుమార్ కి కలం కౌంటర్ దినపత్రిక వినాయక చవితి వ్రత కల్పం బుక్ అందజేసిన పట్టణ ప్రముఖులు మాజేటి గోపాల కృష్ణ శ్రేష్టి.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com